కథా నిలయం
3849
శ్రీకాకుళం

# అవతలి గట్టు

కృష్ణా ప్రవాహాన్ని చీల్చుకుంటూ దోవ చేసుకు పోతోంది, ముక్త్యాల పోయే లాంచి. లాంచి పోతున్న వేగానికి, ఎత్తుగా లేచిన అలలు ఎగిరిపడుతూ వేగంగా ఒడ్డు మీదికి పరుగెత్తి విరిగిపడుతున్నాయి. శాస్త్రి కాబిన్ కిటికీ లోంచి ఒడ్డు వైపు చూస్తున్నాడు. గట్టుమీద లీలగా కన్పిస్తున్న తల్లి దండ్రులు, తనని పంపటానికి వచ్చిన స్నేహితులు, తను ఇంత కాలం పుట్టి పెరిగిన ఊరు, దేవాలయ శిఖరాలు, స్నానాల రేవు, రేవులో పడవలు, రేవు గట్టుమీద చింత చెట్లు అన్నీ దూరమై పోతున్నాయి — తను అన్నింటికీ దూరమైపోతున్నాడు. అందరూ నువ్వాక్కడ్లేదు అని తరిమి వేస్తున్నట్లనిపించింది శాస్త్రికి.

రేవు బాగా దూరమైపోయింది. తను ఒంటరిగా మిగిలి పోయాడు. ఒంటరిగా వెళ్ళినా హాయిగానే ఉంటుంది. కాని తల మునక బరువులు, చుట్టూ బిగించిన సంకెళ్ళు, కాబిన్‌లో కూర్చుంటే బయట నీళ్ళు తన కంఠం మట్టాన ఉన్నాయి. నీళ్ళ సారంగంలోకి పోతున్నట్టనిపించింది శాస్త్రికి. చూపు కాబిన్‌లోకి మళ్ళించాడు. దాని నిండా తనెక్కడ సుఖపడి పోతాడోనని నెత్తిన వేసి కట్టిన సామాను, పెట్టెలు, పక్క చుట్టలు, బుట్టలు, బియ్యం బస్తా, కందిపప్పు టిక్కీ, ఊరగాయ జాడీలు, పక్కనే వరలక్ష్మి అనే భార్యారత్నం.

శాస్త్రి వరలక్ష్మిని మొదటిసారిగా పరిశీలనగా చూశాడు. గుండ్రటి ముఖం, చిన్న నుదురు, ఆ చిన్న నుదుటిమీద పెద్ద కుంకం బొట్టు, చెవులకి పాతకాలపు లోలకులు, మెడ కింద ఎండిపోయిన గంధం, మెళ్ళో వాళ్ళ నాయనమ్మ జిగినీ గొలుసు, దాని వెనకగా తను రెండు చేతుల్తో మూడు ముళ్ళు వేసిన మంగళసూత్రం, పవిట మెడనిండా కప్పుకున్న కొత్త కల నేత చీర, కాళ్ళకు పాంజీబులు, వేళ్ళకు మెట్టెలు, పాదాలకు రాసుకున్న పసుపు, ఆ పసుపుని పులుముకుంటున్న చీర చివర్లు—భర్త తనను గమనిస్తున్నాడని తెలిసి, చీర చివర్లే చూస్తూ ఊపిరి బిగబట్టి కూర్చున్న వరలక్ష్మి — ఈ అమ్మవారితోనా తను జీవితాంతం గడపబోయేది, అనుకున్నాడు శాస్త్రి. శాస్త్రి మళ్ళా చూపు నీళ్ళవైపు మళ్ళించాడు. కొంచెం దూరంగా చిన్న డింగీపడవ బుల్లి తెరచాప నెత్తుకుని వాలుగాలికి రయ్యిన దూసుకుపోయింది. ఆ డింగీలో చుక్కాని పట్టే పిల్లవాడొకడు, గోచీ పెట్టుకుని హాయిగా ఆకాశం వైపు చూస్తున్నాడు. ఈ స్వేచ్ఛా ప్రపంచాన, స్వచ్ఛమైన జలరాశిలో, తన చిన్న డింగీ వేసికొని రయ్యిన పోతూ, వందన స్వీకారం చేస్తున్నట్టున్నాడు ఆ గోచీ పిల్లవాడు. వాడే స్వేచ్ఛా స్వరూపంలా ఉన్నాడు. ఆ గోచీ పిల్లవాడి వైపు చెయ్యి వూపుదాం అనుకున్నాడు శాస్త్రి. అప్పుడే డింగీ చాలా దూరం వెళ్ళిపోయింది. తెరచాప కాగితం ముక్కలా నీళ్ళమీద తేలి, కొంత సేపటికి అదీ దూరమై పోయింది. తిరిగి శాస్త్రి దృష్టికి అఖండ జలప్రవాహం తప్ప మరేం కన్పించలేదు.

మొదట్నించీ శాస్త్రి జీవితానికి సంబంధించిన విషయాలు అతని ఇష్టంతో నిమిత్తం లేకుండా జరుగుతూ వచ్చాయి. ఎవరో ఒకరు నిర్ణయాలు చేసేవారు; శాస్త్రి అనుభవించేవాడు. స్కూల్ ఫైనల్ కాగానే తండ్రి టీచర్ ట్రైనింగ్‌లో చేర్పించాడు. ట్రైనింగ్ పూర్తి కాగానే తల్లి ఒక పిల్లని చూసొచ్చి పెళ్ళి స్థిర పర్చింది. పెళ్ళి కాగానే మేనమామ ముక్త్యాలలో టీచర్ ఉద్యోగం ఖాళీ ఐంది రమ్మని ఉత్తరం రాశాడు. ఉత్తరం అందిన మూడు రోజుల్లో కొత్త సంసారానికి కావాల్సిన సామాను కూర్చి, భార్యను చేర్చి లాంచీ ఎక్కించేశారు తనవాళ్ళంతా. నిజానికి శాస్త్రికి టీచర్ ట్రైనింగ్ ఇష్టంలేదు. పెళ్ళి, పెళ్ళాం, ఉద్యోగం ఏవీ ఇష్టం లేవు. తన జీవిత గమనానికి, తన ఇష్టాలకి సంబంధం లేదు కాబోలు అనుకున్నాడు శాస్త్రి.

ఒక పాలేరు ప్రవాహానికి ఎదురుగా తెప్పకొయ్యమీద సర్రున ఈదుకుంటూ, ముందున్న గొడ్లని మళ్ళిస్తూ లంకకి పోవటం కన్పించింది. శాస్త్రి చూసుకుపోతున్న ఆ తెప్పకొయ్యవైపు, ఆ నల్లటి పాలేరువైపు, బారలు బారలుగా ఈదుతున్న అతని బలమైన చేతులవైపు ఆశగా, అసూయగా చూశాడు.

లాంచీ కుతకుత ఉడుకుతూ ఇంకా ముందుకి నడిచింది. లాంచీ మోతవిని, ఒడ్డు మీదినుంచి గాలిలో కెగురుతున్న తెల్లటి కొంగలు, లంకలో గాలికి హాయిగా తురాయిల్లా ఊగుతున్న రెల్లుపూలు, ఆ పక్కనే నిశ్చింతగా పిల్లనగ్రోవి ఊదుకుంటూ పశువుల్ని మేపుతున్న కుర్రాడు, వీళ్ళని చూస్తుంటే, తన్నెవరో కుళ్ళ పొడుస్తున్నట్టు, తనలో నెత్తురు

చచ్చిపోయినట్టు, తన చేతకాని తనాన్ని హేళన చేస్తున్నట్టు అనిపించింది శాస్త్రికి. ఏమైనాసరే ముక్త్యాల వెళ్ళగానే చెప్పేస్తాను – 'నేనీ ఉద్యోగం చెయ్యనని' అనుకున్నాడు శాస్త్రి. మరి ఉద్యోగం మానేయొచ్చు — కట్టుకున్న పెళ్ళాం!— శాస్త్రికి తల పగులుతున్నట్లనిపించింది. లాంచీ మోతకు చెవులు పగిలిపోతున్నాయి. ప్రవహిస్తున్న కృష్ణలోకి ఉరుకుదామనుకున్నాడు.

'స్టాప్' స్టీరింగ్ దగ్గిర డ్రైవర్ గావుకేక పెట్టాడు.

ఇంజన్ మోత తగ్గింది. లాంచీ ఒడ్డు పట్టింది. శాస్త్రి బయటికి తొంగి చూచాడు. ఐదారుగురు ప్రయాణీకులు లాంచీ ఎక్కుతున్నారు. అందులో ఇద్దరు నవదంపతులు ఉన్నారు. పసుపు నిండిన మధుపర్కాలు కట్టుకుని, క్రీగంట నవ్వులు అందిపుచ్చుకుంటూ ఒకరి వెనుక ఒకరు లాంచీ ఎక్కారు. వరలక్ష్మి ఆ కొత్త జంటని చూస్తున్నప్పుడు ఆమె కళ్ళలో కాంతి వెలిగించి సన్నగా చిరునవ్వు కదిలింది. శాస్త్రివైపు చూచింది. శాస్త్రి ముఖం పక్కకు తిప్పుకున్నాడు. వరలక్ష్మి భర్త వాలకం చూసి చిన్నబుచ్చుకుందో, నిరుత్సాహ పడిందో శాస్త్రికి తెలియదు. వరలక్ష్మి సంతోషం, ఆనందం తనకి పట్టని విషయాలుగా ఉన్నాయి శాస్త్రికి. ఇంతలో లాంచీ ఆసామీ వెంకటస్వామి వచ్చి పలకరించాడు. 'బాబుగారూ ఇక్కడ కులాసాగా ఉందా' అని.

'ఆఁ ఆఁ. ఉంది గాని ఇంకెవరినైనా ఇక్కడ కూర్చోపెట్టు' అన్నాడు శాస్త్రి.

'ఇక్కడికింకెవరూ రార్లెండి. అవతల సర్దుకుంటారు. ఏవన్నా కావాలంటే అడగండేం' అని వెళ్ళిపోయాడు వెంకటస్వామి.

వెంకటస్వామి శాస్త్రి తండ్రికి చిన్నప్పటి నుంచీ తెలుసు. అందుకనే కాబిన్ రూంలో ఇంకెవర్నీ ఎక్కనీకుండా వాళ్ళిద్దర్నే కూర్చోపెట్టి ప్రత్యేకంగా యోగక్షేమాలు విచారిస్తున్నాడు. శాస్త్రికి ఇంకెవరైనా వచ్చి కూర్చుంటే బావుండు ననిపించింది. కాని వెంకటస్వామి కట్టుదిట్టం చేసి, తనను ఈ కాబిన్ రూంలో బిగించాడు. దోమ తెరలో దూరిన దోమలా ఎదురుగా కూర్చున్న వరలక్ష్మి శాస్త్రిని బాధిస్తోంది.

లాంచీ మళ్లీ రొద చేసికొంటూ ముందుకు సాగింది. శాస్త్రి నీళ్ళ వైపే చూస్తున్నాడు. కృష్ణ తళతళ మెరుస్తూ కులుకుతూ తుళ్లింతలతో పరుగెత్తి పారిపోతోంది. ఆ చైతన్య స్రవంతిలో తన బతుకులా కదలకుండా ఉన్న నల్లబండరాళ్ళు కొన్ని అక్కడక్కడా కన్పించినై శాస్త్రికి. వరలక్ష్మి తన వైపే చూస్తోందేమో – అనిపించింది శాస్త్రికి.

ఏం చూస్తే?

ఎందుకు చూడాలి?

ఆమెను చూడొద్దనటానికి నువ్వెవరు?

తను పొందుతున్న కలవరాన్ని గుర్తిస్తోందా?

ఏం గుర్తిస్తే?

ఆమెకు తన వేదన తెలిస్తే, రహస్యం రచ్చకెక్క నల్లయిపోదూ?

ఎప్పుడయినా తెలియాల్సిందేగా!

బాధపడుతుందేమో ?

నీకేం బాధపడ్తే?

నే నెందుకు ఆమెను బాధపెట్టాలి ?

పోనీ సుఖపెట్టరాదూ ?

ఎట్లా !...ఎట్లా ?

శాస్త్రికి ఒళ్ళంతా సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. వరలక్ష్మి చూడకుండా చూసిన చూపులు. ఆ చూపులు తన గుండెలో టార్చిలైట్ వేసి వెతుకుతున్నట్టున్నాయి. శాస్త్రి ఉలిక్కిపడ్డాడు. మెల్లగా నీళ్ళవైపునుంచి ముఖాన్ని కాబిన్ లోకి తిప్పాడు. వరలక్ష్మి తలవంచుకుని కూర్చుంది, కాని కళ్ళు తనను గమనిస్తూనే ఉన్నాయని ఖాయపర్చుకున్నాడు శాస్త్రి. వరలక్ష్మిని పలకరిద్దామనుకున్నాడు.

ఎందుకు పలకరించటం ?

ఊరికినే.

ఏఁవని పలకరించటం ?

ఏదో ఒకటి.

శాస్త్రి 'ఈలాంటి కుదుపు బాధగా ఉందికదూ' అన్నాడు.

వరలక్ష్మికి ఒళ్ళు జలదరించింది. తల మరీ వంచుకొంది. పవిటకొంగు మరీ బిగిగా చుట్టూ కప్పుకుంది కాని మాట్లాడ లేదు. ఆమె పొందుతున్న భయానికి ఆశ్చర్యపడ్డాడు శాస్త్రి. శాస్త్రాగి మళ్ళీ అన్నాడు 'మంచినీళ్ళు కావాలా? అందులో అర్ధాంగిని అడుగుతున్న ఆప్యాయతలేదు. వరలక్ష్మి చలించింది. ఈదురుగాలికి వణికిన మామిడాకు చివుళ్ళలా ఆమె పెదవులు

కదిలాయి. ఏదో అస్పష్టంగా ధ్వనికూడా వెలువడింది. అందులో అక్షరాలు లేవు.

అసలు శాస్త్రికి ఆమె సమాధానంతో పనిలేదు. వరలక్ష్మి పడుతున్న అవస్థచూసి శాస్త్రి చిరాకుపడ్డాడు. ఆమె ఎవరో ముక్కు మొహం తెలియదు. లుంగ గా చుట్టుకున్న కలనేత చీరలో ఎంతమనిషో తెలియని ఈ మెతోనా తన బతుకంతా వెళ్ళమారబోతోంది—అనుకున్నాడు శాస్త్రి. శాస్త్రగి శాస్త్రి మళ్ళీ నీళ్ళవైపు ముఖం తిప్పుకోబోతూ వర లక్ష్మిని చూసి ఆశ్చర్యపోయాడు. వరలక్ష్మి తల వంచుకొని చిరునవ్వు నవ్వుకుంటోంది. శాస్త్రి తదేకంగా చూశాడు. ఆమె ఇంకా నవ్వుకుంటోంది. ఆమె పెదవులు విచ్చుకుంటున్న పూరేకుల్లా ఉన్నాయి. శాస్త్రికి భయంవేసింది.

ఆమె ఎందుకు నవ్వుతోంది?

తనను గురించా?

తనకి దగ్గిరగా జరుగుతోందా?

చటుక్కున తల నీళ్ళవైపు తిప్పుకోబోయాడు. అంత కంటే ముందే వరలక్ష్మి తల పైకెత్తి అడిగింది 'మీకు కాఫీ ఇవ్వనా?'

శాస్త్రి విస్తుపోయాడు 'ఆఁ...ఊఁ' అన్నాడు. అసలు అక్కర్లేదని కటువుగా చెప్పాలనుకున్నాడు.

వరలక్ష్మి, శాస్త్రి సమాధానంకోసం చూడలేదు. లేచి పైనున్న బుట్టలు పక్కకుపెట్టి కింద ఫ్లాస్కు తీసి కాఫీపోసి ఇచ్చింది. శాస్త్రి తేరుకుని చూస్తున్నాడు. వరలక్ష్మిలో ఇంత ధైర్యం ఉందని తనకి తెలియదు. ఆమె ఇంత త్వరగా ఇంత చొరవగా ప్రవర్తిస్తుందనుకోలేదు. తనకి తెలియకుండా కాఫీ

గ్లాసందుకున్నాడు. పరాయివాళ్ళెవరో తన పూజామందిరం లోకి చొచ్చుకొచ్చి తిష్టవేసిన ట్లనిపించింది శాస్త్రికి. నెత్తురు వేదనగా పొంగింది. ఏం చెయ్యాలో ఏం చెయ్యకూడదో తెలియ లేదు.

'బాగలేదు' అంటూ కాఫీ గ్లాసుతోసహా కృష్ణలోకి విసిరేశాడు.

శాస్త్రి ముఖం నీళ్ళ వైపునుంచి మరల్చలేదు. తన వెనక వరలక్ష్మి ఖేదపడుతోందని కంట నీరెట్టుకుంటుందని శాస్త్రికి తెలియక పోలేదు. ముఖం కాబిన్‌లోకి తిప్పటానికి భయంగా ఉంది శాస్త్రికి. ఆ నాలు గడుగుల కాబిన్‌లో అగ్ని గోళా లున్నాయి. అక్కడ వినపడని ఆక్రందనలు, హాహాకారాలు.

లాంచీ మోత మరీ ఎక్కువైంది. సరంగు గొట్టాం లాంటిది ఒకటి పుచ్చుకుని, లాంచీ పైకెక్కి ఒడ్డునున్న ప్రయాణీకులకి విన్పించేలా 'లాంచీ ముక్కాల పోతోంది' అని అరుస్తున్నాడు.

'సరాసరి సముద్రంలోకి పోతే బావుండు' అను కున్నాడు శాస్త్రి.

ఉన్నట్టుండి ఇంజన్ రూంలో 'ఠాప్' మని మోత మోగింది. లాంచీ వాళ్ళంతా గొల్లున ఇంజన్ రూంలోకి పరుగెత్తారు. కకావికలుగా అరుస్తున్నారు. ప్రయాణీకులు కంగారుగా లేచారు 'ఏవి టేవి ట'ని. ఇంజను సాంతం ఆగి పోయింది. లాంచీని ఒడ్డు పట్టించారు. ప్రయాణీకులు, లాంచీ వాళ్ళు గోలగా అరుచుకుంటూ ఘర్షణ పడుతున్నారు. శాస్త్రి కాబిన్‌లోంచి లేచి లాంచీ పైకి వచ్చాడు. కొందరు ప్రయా

జీవులు ఒడ్డుమీాది కెళ్ళారు. లాంచీ వాళ్ళు వాళ్ళని సముదా యిస్తూ వివరంగా చెప్తున్నారు. దాని సారాంశం ఇది. లాంచీ పంకా విరిగిపోయింది. ఆ పనిముట్టు విజయవాడలో కాని దొరకదు. అది తీసుకొచ్చి వేసి మళ్ళీ లాంచీ బయలుదేరటానికి నాలు గైదు రోజులు పడుతుంది. శాస్త్రి కివే పీ పట్టలేదు. లాంచీ ఆగి పోవటం అతనిలో ఆందోళన కలిగించలేదు. శాస్త్రి నుంచున్న చోటికి వెంకటస్వామి వచ్చి 'ఏం చేస్తాం బాబూ' ఇట్లా వచ్చింది. నాలుగు మైళ్ళు తూర్పుగా బస్ రోడ్ ఉంది. అక్కడికి కెళ్ళి బస్సెక్కితే మెల్లిగా ముక్త్యాల చేరొచ్చు' అన్నాడు.

'అహఁ' అన్నాడు శాస్త్రి ఒడ్డున పేరుకున్న రేగడి మట్టిని చూస్తూ.

మళ్ళీ వెంకటస్వామి చెప్పటం మొదలెట్టాడు. 'లేకపోతే ఇక్కడికి ముక్త్యాల రేవు పది మైళ్ళుంది. అక్కడికి సరాసరి పడవ కట్టించుకున్నా సరిపోతుంది'.

శాస్త్రి 'అయితే సరే' అన్నాడు.

వెంకటస్వామి అడిగాడు 'ఏం చేద్దామనుకుంటున్నారు?'

'ఏం చేస్తాం?' అన్నాడు శాస్త్రి.

వెంకటస్వామికి తనిందాకటినుంచీ చెప్పింది విన్నాడా లేదా అని అనుమాన మొచ్చింది. 'అదే బాబూ! లాంచీ ఐదారు రోజులకి గాని బాగుపడదు. మీారిటు బండి కట్టించుకుని బస్సుదాకా వెళ్ళి బస్సెక్కుతారా లేకపోతే ఏదైనా సరాసరి పడవ వేయించుకుంటారా?' అన్నాడు.

వీటన్నిటినీ శాస్త్రి తన మెదడులో ఇముడ్చుకోలేకపోయాడు.

'ఏం చెయ్యమంటావో చెప్పు?' అన్నాడు.

'ఇప్పు డింకేం చేస్తాం. ఇంకో గంటలో పొద్దు గూకు తుంది. ఇక్కడికి ఊరు రెండు మైళ్ళుంది. ఈ రాత్రికి భోజ నానికి కావలసిన వేవైనా తెప్పించుకోండి. రే ప్పొద్దున ఇద్దరం వెళ్లి బండో, పడవో చూద్దాం' అని వెళ్ళిపోయాడు వెంకటస్వామి.

వెళ్ళిన వెంకటస్వామి వెనక్కి వచ్చి 'ఊళ్ళో సామా నుకి మా కుర్రాళ్ళెళ్తున్నారు. మీ కేవన్నా కావాలంటే చెప్పండి' అని వెళ్ళిపోయాడు.

శాస్త్రి కేమీ తోచలేదు. ప్రయాణీకులు చాలామంది తక్కువ సామానుతో ఉన్నవాళ్ళు కాబట్టి ఆ రాత్రికి ఊళ్ళో పడుకుని పొద్దునే బస్సుకి వెళ్దామని లాంచీ దిగి వెళ్ళిపోయారు. లాంచీలో లాంచీ వాళ్ళు, శాస్త్రి, వరలక్ష్మి మిగిలారు.

శాస్త్రి అట్లాగే లాంచీ టాపు నానుకొని నిలబడ్డాడు. ఒడ్డు వెంట కాస్సేపు నడుద్దామనుకున్నాడు. రాత్రి భోజనం ఏర్పాట్లు చూడాలని జ్ఞాపకం వచ్చింది. కాబిన్‌లోకి వెళ్ళి వరలక్ష్మితో మాట్లాడాలి. లాంచీ ఇట్లా మధ్యలో ఆగి పోయిన సంగతి వివరంగా చెప్పాలి. ఎందుకు మాట్లాడాలి? ఎందుకు చెప్పాలి? అనిపించింది శాస్త్రికి.

'చెప్పడం నీ బాధ్యత.'

'నాకే బాధ్యతలూ లేవు. ఎవరో తెచ్చిపెట్టిన భారం నే నెందుకు మొయ్యాలి.'

'ఆమె బాధపడుతుంది.'

'దానికి నా బాధ్యత లేదు.'

'నువ్వామె మీద పగసాధిస్తున్నావు.'

'నే నెవరిమీదా పగసాధించటంలేదు. నా మీద నాకే పగ.'

-గబగబా ఒడ్డు దిగి, నడిచి వెళ్ళాడు శాస్త్రి.

శాస్త్రి తిరిగొచ్చేప్పటికి పొద్దు పోయింది. లాంచీలో చిన్న లాంతరు వెలుగుతోంది. చుట్టూ చీకటి. లాంచీ ఎక్కటానికి భయంవేసింది. కాబిన్‌లో వరలక్ష్మి ఉంటుంది. ఆమెతో మాట్లాడాలి. లాంచీ టాపుమీద కూర్చున్నాడు శాస్త్రి. ఆ చివరగా వెంకటస్వామి, లాంచీవాళ్ళు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఒక కుర్రాడు శాస్త్రి దగ్గర కొచ్చి 'అమ్మగారు పిలుస్తున్నారు' అని చెప్పాడు.

శాస్త్రి 'సరే' అన్నాడు కాని కాబిన్‌లోకి వెళ్ళదల్చుకోలేదు. వెంకటస్వామీ, కుర్రాళ్లూ తన వైపే చూస్తుండటం గమనించి, బావుండదని కాబిన్‌లోకి వెళ్ళాడు. అక్కడ చిమ్నీ దీపం వెలుగుతోంది. ఆ గుడ్డి వెలుగులో మూలగా వరలక్ష్మి నుంచుని ఉంది. వరలక్ష్మి ముఖం సరిగ్గా కన్పించటం లేదు. కనిపించినా శాస్త్రి చూడదల్చుకోలేదు. ఎదురుగా బల్లమీద విస్తట్లో వడ్డించిన భోజనం కనిపించింది. భోజనం చూసేప్పటికి శాస్త్రికి చెడ్డ కోప మొచ్చింది. ఆ రాత్రికి తను పస్తు పడుకోవాలనుకున్నాడు. వరలక్ష్మి కూడా మాడాలనుకున్నాడు. లోపల ఆకలేస్తున్నా తాను ఉండదనుకున్న భోజనం, ముఖ్యంగా వరలక్ష్మి వడ్డించిన భోజనం ఎదురుగా చూసి వేగిపోయాడు.

'ఎక్కడిది ఇదంతా'—పాడుపడిన దిగుడు బావిలో రాళ్ళు పగలగొడుతున్న స్వరాన్ని పోలి ఉంది శాస్త్రి గొంతు.

వరలక్ష్మికి మాట పెగల్లేదు. తడబడుతూ చెప్పింది, 'అత్తయ్య...కారియర్‌లో పెట్టిచ్చారు' అని.

శాస్త్రికి మళ్ళీ అనడాని కేమీ దొరకలేదు. అన్నం ముందు కూర్చున్నాడు. ఆకలిగా ఉన్నా అతనికి తినబుద్ధి కాలేదు. తనకు అన్నం తినగానే పాలు తాగే అలవాటు. పాలుంటే బావుండు అనుకున్నాడు. 'పాలు కాదుగదా, తాగటానికి విషంకూడా ఉండదు' అనుకున్నాడు. నాలుగు మెతుకులు నంజి చెయ్యి కడుక్కున్నాడు. చెయ్యి కడుక్కుని వెనక్కి తిరిగేసరికి ఎదురుగా పాల గ్లాసుతో వరలక్ష్మి నుంచుని ఉంది. పాలని చూసేప్పటికి శాస్త్రికి మళ్ళీ ఎక్కడ లేని కోప మొచ్చింది. తను పాలు లేకుండా బాధ పడ్డామను కున్నాడు. కావాలనుకున్న వస్తువైనా తను వద్దనుకుంటున్న వరలక్ష్మి అందిస్తోంది. వదలించుకుందా మంటే తన్నింకా బిగిస్తోంది.

'ఎక్కడివి పాలు' కత్తితో అక్షరాలుగా కోసినట్లు అడిగాడు.

'కుర్రాడు తెచ్చాడు.'

'నాకీ అలవాటుందని ఎట్లా తెలుసు ?'

'అత్తయ్య చెప్పారు.'

ఇంక శాస్త్రికి మాటల్లేవు. పాలు గటగటా తాగేసి లాంచీ టాపుమీదికి వెళ్ళిపోయాడు. టాపుమీది కుర్రాళ్ళు ఒక్కొక్కడే కిందికి వెళ్ళి పడుకుంటున్నారు. రాత్రి పదకొండు దాటింది. ఒడ్డుమీద చీకట్లో కీచురాళ్ళు అరుస్తున్నాయి. చీకట్లో కృష్ణమ్మ నల్ల తాచులా పాకుతోంది.

'వరలక్ష్మి ఒంటరిగా భయపడుతుందేమో' అనిపించింది శాస్త్రికి.

తనకీ బతుకంటేనే భయంగా లేదూ — అనుకున్నాడు.

అయినా చూద్దామని టాపు దిగి కాబిన్‌లోకి తొంగి చూశాడు. చిమ్నీ మసగ వెలుగులో కూర్చుని జోగుతూ కన్పించింది. వరలక్ష్మి అన్నం తిన్న సూచనలు లేవు. తన అలికిడి గమనించి వరలక్ష్మి దిగ్గున లేచి నుంచుంది.

'నేను...పైన పడుకుంటాను నువ్వు పడుకో' అని వెళ్ళిపోతూ, ఎందుకో అనాలనిపించి శాస్త్రి ఇలా అన్నాడు— "నువ్వు అన్నం తిన్నట్టులేదు. నీవు వస్తుండి నన్నేం సుఖపెట్టలేవు." శాస్త్రి వెనక్కు తిరిగిన వెంటనే ఖంగున వరలక్ష్మి గొంతులో ఎక్కిళ్ళు మ్రోగినై. నొక్కిపట్టిన ఏడుపు వినిపించింది. శాస్త్రి తిరిగి చూడదలుచుకోలేదు. టాపుమీది కొచ్చేశాడు. వరలక్ష్మిలో పెల్లుబికిన దుఃఖం శాస్త్రిని నీడలా వెంటాడుతోంది.

'తను ఆమెను హింసిస్తున్నాడా?' అనుకున్నాడు శాస్త్రి.

'ఆమెవల్ల తను రంపపుకోత పడటంలేదూ?'

'ఆమెను వ్యథపెట్టడం న్యాయమేనా?'

'నా బ్రతుకు నేను బ్రతకటం ఆమెనువ్యథపెట్టడమా?'

'ఆమెను పెళ్ళి చేసికొన్నాక ఆమెతో కలసికదా బ్రతకాల్సింది?'

'అది నాకు చేతకాదు.'

'అన్యాయం! కాఠిన్యం!'

'నాకు ఇష్టంలేని పనిచెయ్యడం' కృతకంగా బ్రతకడం న్యాయమా ?'

'ఆమె అమాయకురాలు. నన్ను నమ్ముకుంది.'

'నన్ను ముళ్ళకంప కావిలించుకుని నిన్నే నమ్ముకున్నా నంటే నేనేం చేసేది ?' – శాస్త్రి రోదనగా తలెత్తి ఆకాశం లోకి చూశాడు. అక్కడ విచ్చలవిడిగా చిమ్మిన లక్షలు కోట్ల నక్షత్రాలు ! తనను చూచి నవ్వుతున్న నక్షత్రాలు ! చూడ లేక తల మోకాళ్ళ మధ్య ఇరికించుకున్నాడు.

భళ్ళున తెల్లవారింది.

వెంకటస్వామీ, శాస్త్రీ పొద్దున్నే ఊళ్ళో కెళ్ళారు. ఎంత డబ్బిస్తామన్నా ఏరువాక సమయం కావటంవల్ల బండి కట్టమంటే కట్టమన్నారు; ఇంక పడవే శరణ్యాం అనుకుని వెతగ్గా చివరికి ఒక గూడు పడవ కుదిరింది. పడవ సరంగుని మధ్యాహ్నం వచ్చేట్లు మాట్లాడుకుని కూరలు, పెరుగు తీసి కొని లాంచీ దగ్గరకొచ్చారు.

మధ్యాహ్నం రావలసిన గూడు పడవ సాయంత్రం నాలుగింటి కొచ్చింది. పడవలోకి సామానంతా ఎక్కించి వెంకటస్వామి దగ్గిర సెలవు తీసికొని పడవెక్కారు శాస్త్రి, వరలక్ష్మి. పడవ సాగింది. నాలుగు మైళ్ళు పోయి ఈ రాత్రికి మజిలీ చేద్దామని, మిగతా ఆరు మైళ్ళు రేప్పొద్దున్నే లాగిద్దా మని చెప్పాడు పడవ సరంగు. పడవ సరంగు యాభై పైబడ్డ వాడు. సరంగు, అతని కూతురు ఇద్దరే ఆ పడవలో ఉంటారు. అదే వాళ్ళ ఇల్లు, అందులోనే కాపురం. తండ్రి గడవేస్తుంటే కూతురు చుక్కాని పడ్తుంది. పడవ గుడిసెలో ఉన్న పొయ్యి సరిచేస్తూ సాయంత్రం వంటకు తయారవుతోంది వరలక్ష్మి.

'అన్నంలో కేం చెయ్యమంటారు ?' సన్నగా అడిగింది వరలక్ష్మి.

'నాకు తెలియదు' అని లేచి గూడునుంచి బైట కొచ్చేశాడు శాస్త్రి.

'ఏం చెయ్యమంటారూ — అన్నీ నా కిష్టమైనవి అమరుస్తునట్లు'.

'అమర్చటం లేదా ?'

'ఎందుకు అమర్చటం ?'

'భార్య కాబట్టి.'

'నా కక్కర్లేదు.'

'అంటే ఎక్కడికి పోతుంది.'

'ఏట్లోకి.'

వెనక్కు తిరిగి చూశాడు శాస్త్రి. చుక్కాని దగ్గర రంగురంగుల పూలపైట గాలి కెగురుతోంది. సరంగు కూతురు చుక్కానిపడ్తూ సన్నగా పదం పాడుతోంది. చుక్కానివైపు నడిచి వచ్చాడు శాస్త్రి. సరంగుకూతురు శాస్త్రినిచూచింది. శాస్త్రి 'ఇక్కడ కూర్చోనా ?' అనడిగాడు.

'కూకోడానిగ్గూడా అడగాల్నా ?' నీళ్ళు గలగల పారినట్లు నవ్వింది.

శాస్త్రి కూర్చున్నాడు. సరంగు గడవేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. శాస్త్రి తల పైకెత్తి చూశాడు. సరంగు కూతురు కాటుక కళ్ళు నవ్వుతున్నాయి. లేచి నుంచున్నాడు శాస్త్రి.

'లేచావేం బాబయ్యా?' అంది సరంగు కూతురు. నవ్వు ఆమె ముఖంలోంచి ఇంకా మాయమవలేదు. ఆ నవ్వు కలకాలం ఉండాలనుకున్నాడు శాస్త్రి.

'నిన్ను చూద్దామని' అన్నాడు శాస్త్రి.

సరంగు కూతురు వెనక్కి విరుచుకుని కెరటాలు కెరటాలుగా నవ్వింది.

నవ్వాపి 'నిన్ను చూత్తానని ఎవరైనా సెప్పిసూత్తారా?' అంది సరంగు కూతురు ఓరగా చూస్తూ?'

శాస్త్రి గుండెలో పువ్వులు పూచినట్లైంది. పెద్దగా నవ్వాడు. గడవేస్తూ ఈ చివరికొచ్చిన సరంగు 'అది ఎర్రి బాగుల్ది బాబయ్యా. అట్టనే మాటలాడద్ది. నవ్వుకోమాకండి' అని గడవేస్తూ తిరిగి ఆ చివర కెళ్ళాడు.

నాలుగో మైలున పడవకి లంగరేసి విశ్రాంతి తీసికొంటున్నాడు సరంగు.

సరంగు కూతురు 'కూరాకు ఏరుకొస్తా అయ్యా!' అంది తండ్రితో. 'తొందరగా రా' అన్నాడు సరంగు నల్ల మందు మాత్ర మింగుతూ. 'నువ్వుకూడా వస్తావా బాబయ్య! గట్టు చూపిస్తా' అంది సరంగు కూతురు. 'పద' అన్నాడు శాస్త్రి తనూ పడవమీంచి గట్టుమీదికి దూకుతూ.

చెట్లు తొలగేసుకుంటూ, చెంగున ఎగురుతూ, గాలి కంటె ముందుగా రయ్యన పరుగెత్తుతోంది, సరంగు కూతురు. కొంతదూరం పోయి ఆగి వెనక్కి తిరిగి చూచి 'నువ్వు నడవ లేవా బాబయ్య' అంది.

'నీలా పరుగెత్తలేను' అన్నాడు శాస్త్రి.

'నా నడకే అంత. పోనీ మెల్లింగ నడుస్తానేఁ' అంది ముఖం పక్కకు వంచి లాలనగా చూస్తూ. శాస్త్రికి ఆ కళ్ళని ముద్దు పెట్టుకోవా లనిపించింది. ఆ కనుపాపల్లో తన బొమ్మ చూసుకోవా లనిపించింది.

'అట్ట సూడకు బాబయ్యా' అంది బుంగ ముఖం పెట్టి సరంగు కూతురు.

'ఏం?' అన్నాడు శాస్త్రి.

'నాకు భయం.'

'ఎందుకు?'

'ఏవోఁ అంది గాలిలోకి చెయ్యి విసుర్తూ. మా మావ కూడా అట్టాగే సూత్తాడు. వద్దన్నా ఇనడు'.

'పోనీ నేను వింటాలే.'

'నువ్వు మంచోడివి' అంది మురిపెంగా నవ్వి. శాస్త్రికి దేవతలు కరుణించినట్లయింది.

సరంగు కూతురు తోటకూర మళ్ళదగ్గిర కెళ్ళి కొన్ని పీకి తిరిగి బయలు దేరింది. 'ఆక లెయ్యటంలా పద పద' అని శాస్త్రిని తొందర చేసింది. ఇద్దరూ పడవ దగ్గిర కొచ్చారు.

శాస్త్రి చుక్కాని దగ్గరే కూర్చున్నాడు. బాగా చీకటి పడింది. నక్షత్రాలు స్పష్టంగా వెలుగు తున్నాయి. సరంగు కూతు రొచ్చి 'బాబయ్యా! అమ్మ పిలుస్తోంది' అని చెప్పింది.

శాస్త్రి పడవ గూడులోకి వెళ్ళాడు. విస్తట్లో అన్నం వడ్డించి ఉంది. వరలక్ష్మి తలవంచుకూర్చుంది. శాస్త్రి గబగబా అన్నం ముద్దలు మింగు తున్నాడు.

'మిమ్మ ... ల్ని కష్ట పెడ్తున్నాను' అంది వరలక్ష్మి నూతిలోని గొంతుకలా.

'శాస్త్రి 'అవు...ను...క ... ష్టా ... లు' విడగొట్టి, పలుగురాళ్ళు విసిరినట్లు అన్నాడు.

వరలక్ష్మి కొంగు నోట్లో కుక్కుకుంది. ముఖం చేతుల్తో కప్పుకుంది.

శాస్త్రి గూడు బయటికి వచ్చేశాడు. సరంగు అన్నం తిని నల్లమందు మత్తుతో కూతుర్తో మాట్లాడు తున్నాడు. మల్లెపువ్వుల వాసన గుప్పుమంది. సరంగు కూతురు ఎప్పుడు సంపాదించిందో, మల్లెపూలు దండ గుచ్చి తల్లో తురుము కోటం కన్పించింది శాస్త్రికి. శాస్త్రి ఆకాశం చూస్తూ పడు కున్నాడు. గూడులో వరలక్ష్మి పడుకుంటున్న చప్పు డవు తోంది.

శాస్త్రికి నిద్ర రావటం లేదు. ఆకాశం నిండా మల్లె పువ్వులు, గాలినిండా మల్లెపువ్వులు. సరంగు కూతురితో ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు. శాస్త్రికి చిన్న నిద్ర తెర వచ్చి చటుక్కున మెలకువ వచ్చింది. లేచి చూశాడు. పడ వలో సవ్వడి లేదు. అంతా నిద్ర పోయారు. ఒడ్డుమీద సరంగు కూతురు చీకట్లో లీలగా కన్పించింది. ముందుకు నడుస్తోంది. శాస్త్రి కూడా ఒడ్డు మీదికి దిగాడు. చీకట్లో దోవ కన్పించటం లేదు. మల్లెచెండు వాసన దోవగా సరంగు కూతుర్ని అనుసరించాడు. తుమ్మలతోపు అవతల సరంగు కూతురు ఆగిపోయింది. అక్కడ ఉన్న బండరాయి మీద కూర్చుంది. మెల్ల మెల్లగా వస్తున్న మసగ వెన్నెట్లో వయ్యా రంగా కూర్చున్న సరంగు కూతురు శాస్త్రికి మత్తెక్కించింది. ఆమె పాదాలముందు ప్రాణాలు ధారపోద్దామనిపించింది శాస్త్రికి.

అలికిడికి సరంగు కూతురు ఉలిక్కి పడి లేచింది.

'ఏం బాబయ్యా! ఇటొొచ్చి నావ్,' అంది తడబిడపడ్తూ.

'నిద్ర పట్టలేదు' అన్నాడు శాస్త్రి. ఆమె కళ్ళలోకి చూస్తూ.

'నువ్వెందు కొొచ్చావ్ ?' అతి మృదువుగా అడిగాడు శాస్త్రి.

'ఎందుకోలే, నువ్వెళ్ళిపో బాబయ్యా' అంది అవుపించకుండా సిగ్గుపడ్తూ.

'ఏం ? నేనుండ కూడదా ?' అన్నాడు శాస్త్రి.

'ఊహుఁ.'

'ఎందుకని ?'

'ఈడికి మా మావొొస్తాడు' అని సిగ్గుపడి తల అవతలకి తిప్పుకుంది సరంగు కూతురు.

శాస్త్రి దిమ్మర పోయాడు. కింద పడిపోకుండా తుమ్మ చెట్టు మొదలు పట్టుకున్నాడు. సరంగు కూతురు తన మావ పేరెత్తినప్పుడు కలిగిన సిగ్గు చొంతరనుంచి ఇంకా తేరుకో లేదు. శాస్త్రి సర్రున వెనక్కి తిరిగి చర చర నడిచాడు.

ఒడ్డున నడుస్తూ శాస్త్రి భోరున ఏడవా లనుకున్నాడు. తను మనసిచ్చుకున్న చోటికి కెళ్ళాడు — తన్ని రక్కిస ముళ్ళు పీకినై. శాస్త్రికి వరలక్ష్మి జ్ఞాపకం వచ్చింది. సరిగ్గా ఇంతే. తనకు మనసిచ్చుకుంది. కాని ఆమె పొందిన ప్రతిఫలం ?

శాస్త్రి పడవ దగ్గరికి పరుగెత్తు కొొచ్చాడు. గబగబా గూడులోకి దూరాడు. గుడ్డి చిమ్నీ వెలుగులో వరలక్ష్మి నిద్రపోతుంది. వరలక్ష్మి శాపం పొందిన దేవకన్యలా పడి వుంది — తాను చేయని తప్పులకు శిక్ష అనుభవిస్తూ, తాను

పెట్టిన చిత్రహింసలకు బలవుతూ తన్నే నమ్ముకుంది. శాస్త్రి వరలక్ష్మిని చేతుల్లోకి తీసికొని గాఢంగా కౌగిలించుకోవాలను కున్నాడు. పాపం! నిద్ర లేస్తుందేమో! అని ఆగిపోయాడు. ముడి వీడి పడివున్న జడని ముద్దు పెట్టుకున్నాడు. నిశ్శబ్దంగా జడ తడిసిపోయేలా రోదిస్తున్నాడు.

వరలక్ష్మి మెల్లగ కదిలింది. ఒక్క ఉదటున లేచి శాస్త్రిని చూచి గజగజవణికిపోయింది. 'ఎ...ఏ...విటండీ...?' శాస్త్రి వరలక్ష్మిని పొదివికొని అన్నాడు—'నువ్వు ఏమనుకుం టున్నావో నాకు తెలియదు. ఏమనుకున్నా సరే నిన్ను పూలతో పూజించుకుంటాను.'

వరలక్ష్మి తడబడుతూ 'అ...అవేం...మాటలండీ!' అంది.

'అవును...నిజం ... నిన్ను విడిచి వెళ్ళను ... నీతోనే ఉంటాను'— గద్గదంగా అంటూ ఆమె ముఖాన్ని పదేపదే చుంబించాడు శాస్త్రి.

మర్నాడు ఎనిమిది గంటలకి ముక్త్యాల రేవులో 'నే నీ గట్టు చేరలేక మధ్యలోనే కొట్టుకుపోతానేమో అను కున్నాను. కాని చేరాను' అంటూ శాస్త్రి వరలక్ష్మి చెయి పట్టుకుని ఒడ్డెక్కాడు.